కేంద్రాలు ప్రారంభం.. తూకాల్లో జాప్యం

మిల్లర్ల డిమాండ్లపై ప్రభుత్వ ఆదేశాల కోసం వేచిచూస్తున్న యంత్రాంగం

ఈనాడు, సిరిసిల్ల

జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కానున్నాయి. ఈ నెల మొదటి వారంలోనే ముస్తాబాద్, చందుర్తి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రెండ్రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. చలి తీవ్రత పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ధాన్యం ఎంత ఆరబెట్టినా తేమశాతం 17కు రావడం కష్టంగా ఉంటుంది. దీనికితోడు కొనుగోళ్లు ప్రారంభం కాకపోతే ధాన్యం ఆరబోసుకునేందుకు గ్రామాల్లో స్థలాలు దొరకని పరిస్థితి ఏర్పడుతుంది.


అనుపురం కొనుగోలు కేంద్రంలో ధాన్యం

జిల్లాలో అత్యధికంగా 1.56 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. సన్నాలు, దొడ్డు రకాలు కలిపి 4.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. పౌరసరఫరాలశాఖ సేకరణ లక్ష్యం 3 లక్షల మెట్రిక్ టన్నులు. దీనిలో అక్టోబరులో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలి. ముందుగా కోతలు పూర్తి చేసుకున్న సన్న ధాన్యాన్ని మిల్లర్లు నేరుగా గ్రామాల్లోనే కొనుగోలు చేస్తున్నారు.

✦ జిల్లాలో గురువారం నాటికి 102 కేంద్రాలు ప్రారంభించారు. వాటిలో ఎక్కడా తూకాలు జరగడం లేదు. తేమశాతం వచ్చే వరకు ధాన్యం ఆరబోస్తూ.. సాయంత్రం కుప్పలు పోస్తున్నారు. జిల్లాలో మిల్లుల సామర్థ్యం వారీగా ధాన్యం కేటాయింపులు పూర్తయ్యాయి. అలాగే కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపునకు లారీలకు టెండర్లు కూడా జరిగాయి.

సేకరించాల్సిన ధాన్యం ఇలా..

నెల	సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నుల్లో)
అక్టోబరు	25,000
నవంబరు	75,000
డిసెంబరు	1,50,000
జనవరి	50,000

✦ ధాన్యం టెస్ట్ మిల్లింగ్, సీఎంఆర్ నిబంధనలు, పాత మిల్లింగ్ బకాయిల చెల్లింపు, కొత్త ధరల అమలు తదితర అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాలని ఇటీవల మిల్లర్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. దీనిపై రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే రెండుసార్లు సమావేశాలు కూడా జరిగాయి. కానీ వారి డిమాండ్లపై స్పష్టత రాలేదు.

✦ పౌరసరఫరాలశాఖ దొడ్డు ధాన్యం మిల్లర్లకు కేటాయించి, సన్నాలను వ్యవసాయశాఖ గోదాంల్లో నిల్వ చేయాలని ప్రణాళికలు రూపొందించింది. దీనికోసం గన్నీ సంచులకు ప్రత్యేక ముద్రలు వేయడం, వీటిని కుట్టేందుకు ప్రత్యేక ధారాన్ని ఉపయోగించనున్నారు. గోదాంల కేటాయింపుపై వ్యవసాయశాఖ సూత్రప్రాయంగా అంగీకరించినా ఎలాంటి ధ్రువీకరణ మాత్రం ఇవ్వలేదు. ఇటు మిల్లర్లు ముందుకు రాకపోవడం, అటు గోదాంల కేటాయింపులపై స్పష్టత లేక తూకాల్లో జాప్యం జరుగుతున్నట్లు పౌరసరఫరాలశాఖ వర్గాల సమాచారం.

ఆరబెట్టడం.. కుప్పలు పోయడం

- కిషన్, వేములవాడ



నాకున్న మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. పది రోజుల క్రితమే కోతలు పూర్తి చేసుకుని నాంపల్లి పీఏసీఎస్ కేంద్రానికి తీసుకొచ్చాను. ఉదయం కేంద్రానికి వచ్చి కుప్పలుగా ఉన్న ధాన్యాన్ని ఆరబెడుతున్నాను. ధాన్యంపై మంచు పడుతుందని సాయంత్రానికి కుప్పలుగా పోస్తున్నాను. ఇప్పటికీ అధికారులు కేంద్రాన్ని ప్రారంభించలేదు.

స్థలాలకు ఇబ్బంది

- రవి, అనుపురం



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి పది రోజులు అవుతోంది. ధాన్యం ఆరబెట్టాక సాయంత్రం వచ్చి తేమచూడాల్సిన పీఏసీఎస్ సిబ్బంది ఉదయం వచ్చి చూస్తున్నారు. చలిలో ఉదయం తేమ ఎలా వస్తుందని ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వడం లేదు. తేమశాతం చూసి వెంటనే కొనుగోలు చేస్తే స్థలాలకు ఇబ్బందులు ఉండవు.

ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం

- ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్

మిల్లర్లకు సంబంధించిన కొన్ని డిమాండ్లు ఉన్నాయి. వాటిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. దానికోసం వేచిచూస్తున్నాం. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులేకుండా వసతులు సమకూర్చాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించాం.

సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి


ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో గురువారం సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్ టు ఫేజ్ వన్ పనులు వేగవంతం చేయాలని సంబంధిత గుత్తేదారుకు ఈ సందర్భంగా మంత్రి ఆదేశాలు జారీ చేశారని విప్ తెలిపారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా మర్రిపల్లి, కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలని, రుద్రంగిలోని నాగారం చెరువు కాలువపై వంతెన నిర్మాణం, కోనరావుపేట మండలంలోని లచ్చపేట చెరువును రిజర్వాయర్‌గా మార్చే పనులు చేపట్టాలని కోరారు. సూరమ్మ చెరువు కుడి, ఎడమ కాలువలకు సంబంధించి భూసేకరణ చేసి పనులు వెంటనే చేపట్టాలన్నారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి ఎగువ మానేరు ప్యాకేజీ-9 పనులను వేగవంతం చేయాలని, మల్కపేట రిజర్వాయర్‌లో రైతులకు సరిపడా నీటిని నింపాలని అధికారులను మంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు. ఎప్పటికప్పుడు సాగునీటి ప్రాజెక్టులను అధికారులు సందర్శించి పనుల్లో పురోగతిని తెలుసుకోవాలని సూచించారు. త్వరలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా వేములవాడ నియోజకవర్గంలోని ప్రాజెక్టులను సందర్శిస్తానని మంత్రి వెల్లడించినట్లు విప్ పేర్కొన్నారు.

బండలపై ఆలయం.. భలే ఉపాయం



కోనరావుపేట మండలం మల్కపేట అనగానే మనకు కాళేశ్వరం 9వ ప్యాకేజీలోని జలాశయం గుర్తుకు వస్తుంది. ఈ జలాశయం కట్టపైన కోదండరామాలయం నిర్మించారు. ఆలయ నిర్మాణం వరకు స్థలం సరిపోతున్నా ప్రత్యేక పర్వదినాల్లో భక్తుల రాక, జలాశయం చూసేందుకు వచ్చే పర్యాటకులతో ఇరుకుగా మారుతుందని గ్రామస్థులు ఆలోచన చేశారు. కట్టకింది నుంచి పైవరకు రెండు వైపులా పెద్ద బండరాళ్లను పేర్చి మట్టితో చదును చేశారు. మల్కపేట-కోనరావుపేట మార్గంలో వెళ్లే వారికి ఈ ఆలయం పూర్తిగా బండలపైనే నిర్మించారనిపిస్తుంది. - ఈనాడు, సిరిసిల్ల

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం


ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని, వారి త్యాగాలు స్ఫూర్తిదాయకమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పోలీసు చట్టాలు, కేసుల ఛేదన, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఉపయోగం, డాగ్, బాంబు స్క్వాడ్‌లు, ఫింగర్ ప్రింట్ డివైస్, ఆయుధాల వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం, పోలీస్‌స్టేషన్ పని తీరు, సిబ్బంది విధులు, డయల్ 100 తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వారి త్యాగాలను స్మరిస్తూ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. విద్యార్థులు విద్యతోపాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే సిరిసిల్ల పట్టణ పరిధిలోని సర్దాపూర్ 17 బెటాలియన్‌లో కమాండెంట్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, ఉదయ్‌భాస్కర్, పట్టణ సీఐ కృష్ణ, ఆర్‌ఐలు యాదగిరి, రమేశ్, మధుకర్, ఆర్ఎస్ఐ సాయికిరణ్, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ ఆర్టీసీ డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్ ప్రవేశపెడుతున్నట్లు వేములవాడ డిపో మేనేజరు శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ బస్సు నవంబర్ 13న సాయంత్రం వేములవాడ బస్టాండ్ నుంచి బయలుదేరి కరీంనగర్, హైదరాబాద్ మీదుగా అరుణాచలం బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాణిపాకంలోని విఘ్నేశ్వర ఆలయం, నెల్లూరులోని శ్రీమహాలక్ష్మి ఆలయాల దర్శనం అనంతరం నవంబర్ 14న రాత్రి అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన తరవాత నవంబర్ 15న సాయంత్రం బయలుదేరి 16న అలంపూర్ జోగులాంబ అమ్మవారి శక్తి పీఠం దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం కరీంనగర్, వేములవాడకు చేరుకుంటుందన్నారు. అరుణాచలం గిరిప్రదక్షిణ ప్యాకేజీ ధర ఒకరికి రూ.4,500లుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. రిజర్వేషన్ల కౌంటర్లలోనూ బుకింగ్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం చరవాణి నంబరు 9959225926లో సంప్రదించాలని సూచించారు.



> 'నేను నమ్ముకున్న నా కాంగ్రెస్ పార్టీ నుంచి నాకు అగౌరవం ఎదురవుతోంది. ఒకరకంగా ఇది నేను అవమానకరంగా భావిస్తున్నా. ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న పార్టీ వైఖరి వల్ల కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. నాలాంటి వాళ్లు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నా భవిష్యత్తు కార్యాచరణకు మీరే మార్గదర్శకం చేయగలరు.'
>
> **- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకి రాసిన లేఖలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవేదన**

> 'జగిత్యాల అభివృద్ధే నా అజెండా. ప్రస్తుతం ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నా. అవసరమైతే నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుంటా. రోళ్లవాగు ప్రాజెక్ట్ నిర్మాణం సహా కీలకమైన ప్రగతి ఇంకా జగిత్యాలకు అందాలి. నిధులను తీసుకొచ్చి అభివృద్ధి చేస్తా. ఫిరాయింపులతో హత్యలు జరుగుతున్నాయని విమర్శించిన వారి తీరును ఖండిస్తున్నాను. నేనేంటో ఇక్కడి ప్రజలకు తెలుసు.'
>
> **- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్**

● రసవత్తరంగా జగిత్యాల రాజకీయం

● కాంగ్రెస్ శ్రేణుల్లో కలవరం

ఎవరికి వారే!

ఈనాడు, కరీంనగర్

జగిత్యాల కాంగ్రెస్‌లో రసవత్తర రాజకీయ పోరు సాగుతోంది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా జగిత్యాలలో కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డియే. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా పార్టీలో ఆయన నాయకత్వానికి మాత్రం ఎదురు లేదు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరడం.. ఇద్దరు నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ నేత గంగారెడ్డి హత్యతో జీవన్‌రెడ్డి పార్టీపై చేసిన విమర్శలు.. ఫిరాయింపులతో వచ్చిన నాయకుల వల్లే ఈ పరిస్థితి అని ఆరోపణలు చేయడం కలకలం రేపింది. పరోక్షంగా ఎమ్మెల్యేను లక్ష్యంగా చేసుకున్నారన్న అభిప్రాయం కలిగింది. ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను సందిగ్ధావస్థలో పడేసింది. పార్టీ పదేళ్ల తరవాత అధికారంలోకి వచ్చిందన్న ఆనందంలో ఉన్న సమయంలో ఈ పరిణామాలపై వారు కలవరపడుతున్నారు.

ఆవేదనలో జీవన్‌రెడ్డి..

సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రాగా.. తాను ఓడిపోవడంతో నిరాశకు గురయ్యారు. తరువాత లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ స్థానం నుంచి బరిలోకి దిగి పరాజయం పాలవడంతో రాజకీయంగా మరింత ఇబ్బంది పడ్డారు. ఎమ్మెల్సీ పదవిలో కొనసాగుతుండటంతో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ముందుకెళ్తున్న ఆయన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో షాక్ తిన్నారు. తనపై గెలిచిన వ్యక్తిని పార్టీలో చేర్చుకుంటున్నపుడు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై కినుక వహించారు. పార్టీ పెద్దల వైఖరిని తప్పుబట్టిన ఆయన్ని మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు పార్టీ పెద్దలు బుజ్జగించారు. తరవాత పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గానే పాల్గొంటున్నారు. కానీ గతంలోలా తన అనుచరులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నానన్న ఆవేదన ఆయనలో ఉందని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఆయన ముఖ్య అనుచరుడైన గంగారెడ్డి దారుణ హత్యకు గురవ్వడం ఆయనను తీవ్రంగా బాధపెట్టింది. ఈ క్రమంలోనే బాహాటంగానే పార్టీ వైఖరిని విమర్శించడం.. తాజాగా పార్టీ జాతీయాధ్యక్షుడికి లేఖరాయడంతో ఆయన రాజకీయ అడుగులెటు అన్న చర్చ సాగుతోంది.

కలవని చేతులు...

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఈ ఏడాది జూన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటినుంచి ఇప్పటి వరకు ఆయన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో నేరుగా కలిసిన సందర్భాలు ఒకట్రెండు మాత్రమే ఉన్నాయి. ఈ సందర్భంలోనూ వీరిద్దరు ఎడముఖం పెడముఖంగానే ఉన్నట్లు సమాచారం. ఒకే పార్టీలో ఉంటున్నా రాజకీయంగా ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి తన పాత క్యాడర్‌తో కలిసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటుండగా.. ఎమ్మెల్యే హోదాలో డాక్టర్ సంజయ్ తన అనుచర వర్గంతో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొంటున్నారు. కానీ రాజకీయంగా ఎవరికి వారు పై చేయి సాధించాలనే వ్యూహాలు, ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నారు. ఇటీవల కొన్ని సార్లు ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలోనూ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వర్గాల మధ్య వివాదం రేగి ఫిర్యాదులు పోలీసు స్టేషన్ దాకా వెళ్లాయి. మరోవైపు కొన్ని గ్రామాల్లో రెండు వర్గాల పోరు ఇంతకింతకు పెరుగుతుండటం ఆ పార్టీ శ్రేణులను గందరగోళ స్థితిలో పడేస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో ఎవరిది పై చేయి అవుతుంది.. ఎవరు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనేది కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు ఎటువైపునకు దారితీస్తాయనేది రాజకీయ విశ్లేషకులకు కూడా అంతుచిక్కడం లేదు.

లోపించిన పారిశుద్ధ్యం.. కాలనీవాసుల ఇబ్బందులు

ప్రస్తుత వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. పారిశుద్ధ్య లోపంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నా పట్టించుకునే అధికారులు కరవయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలో పారిశుద్ధ్యం లోపించింది. సెప్టిక్ ట్యాంకుల లీకేజీలతోపాటు కాల్వల్లోని మురుగంతా ఇళ్ల సమీపంలో పోగవుతోంది. దీంతో ఈగలు, దోమలు విజృంభిస్తుండటంతో పలువురు కాలనీవాసులు జ్వరాల బారిన పడుతున్నారు. కాలనీ పక్కనే మురుగు నిల్వ తటాకాన్ని తలపిస్తోంది. అందులో పందులు స్వైరవిహారం చేస్తుండగా దుర్గంధం వెదజల్లుతోందని వాపోతున్నారు. దాంతోపాటు వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోతుండగా అపరిశుభ్ర వాతావరణంలో బతుకులను నెట్టుకొస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలో దోమల నివారణ మందు పిచికారీ, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు చేపట్టిన దాఖలాలు లేవని, ఇప్పటికైనా మురుగు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట


ఇళ్ల వద్ద పేరుకుపోయిన మురుగు

రాజన్న ఆలయ హుండీ ఆదాయం రూ.1.46 కోట్లు


హుండీ డబ్బులు లెక్కిస్తున్న ఉద్యోగులు తదితరులు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి చెందిన 30 రోజుల హుండీని అధికారులు గురువారం లెక్కించారు. ఆలయ ఓపెన్ స్లాబ్‌పై హుండీ లెక్కించగా రూ.1,46,16,253 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. బంగారం 211 గ్రాములు, వెండి 09 కిలోల 900ల గ్రాములను భక్తులు వివిధ కానుకల రూపంలో సమర్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కరీంనగర్ సహాయ కమిషనర్ కార్యాలయ పరిశీలకుడు సత్యనారాయణ, ఆలయ ఉద్యోగులు, శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

1న బీసీ కమిషన్ రాక

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్‌లపై రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ బీసీ కమిషన్ నవంబరు 1న కరీంనగర్ వస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నవంబరు 1న కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ ఛైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బీసీ వెల్ఫేర్ కమిషనర్‌లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరపనున్నదని పేర్కొన్నారు. అభిప్రాయాలు, సలహాలు, సూచనలను ఎవరైనా రాత పూర్వకంగా గానీ, అభ్యర్థనలను నేరుగా గానీ తెలియజేయవచ్చని తెలిపారు. అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్‌లు ఆరు సెట్లను తెలుగు, ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, సాక్ష్యాలు, సంబంధిత కేసుల వివరాలను కమిషన్‌కు నివేదించవచ్చని సూచించారు.

సాహితీ కుసుమాలు

న్యూస్‌టుడే, ముస్తాబాద్

ప్రస్తుతం చరవాణులు, సామాజిక మాధ్యమాలకే అతుక్కుపోతున్న రోజుల్లో పలువురు బాలలు సాహిత్యం పట్ల అభిరుచిని పెంచుకుంటున్నారు. చదువుతో పాటు కవిత్వం, రచనల పట్ల పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి కవిత్వం, వ్యాసరచన పోటీల్లో పాల్గొంటూ ప్రశంసలు అందుకుంటున్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్ జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులే ఇందుకు నిదర్శనం. చదువుతోపాటు కథలు, వ్యాసరచన పోటీల్లో పాల్గొని బహుమతులకు ఎంపికైన వారిపై స్ఫూర్తిదాయక కథనం.

స్నేహానికి ప్రతి రూపం

- జక్కుల శ్రావణి, 8వ తరగతి



నేను ఆరో తరగతిలో ఉన్నప్పుడు మా స్నేహితురాలు ఒకరు చదువుపై నిర్లక్ష్యంగా ఉండేది. తానిప్పుడు బాగా చదువుతుంది. ఎలా మారిందనేది ఆరా తీస్తే ఓ కథ ద్వారా మారింది అనే విషయాన్ని తెలుసుకున్నాను. దివ్య అనే బాలిక తరగతి గదిలో ఎప్పుడూ అల్లరి చేస్తుండేది. గొడవపడుతుండేది. అల్లరిపిల్లగా పిలువబడేది. ఆమెను తన స్నేహితురాలు ఎలా మార్చింది అనేది కథ రూపంలో జోడించి రాశాను.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో...

- ఆడెపు గణేశ్, ఉపాధ్యాయుడు



వారధి ఫౌండేషన్ నిర్వహించిన వ్యాసరచన బృందంలో ప్రథమ, ద్వితీయస్థానాలను విద్యార్థులు సాధించడం సంతోషంగా ఉంది. గైడ్ టీచర్‌గా వ్యవహరించినందుకు సంతోషంగా ఉంది. రెండు రోజుల ముందే అంశాలు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలిచారు.

చదువుతోపాటు సాహిత్యంలో తీర్చిదిద్దాలని

- మద్దికుంట లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయుడు, ఆవునూర్



పాఠశాల విద్యార్థులను చదువుతోపాటు సాహిత్య రంగంలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉపాధ్యాయుల సహకారంతో కథలు, వ్యాసరచన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. వ్యాసరచన పోటీల్లో ముగ్గురు పాల్గొనగా ఒక్కొక్కరికి రూ.12 వేలను ఆన్‌లైన్ ద్వారా వారి ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు.

తొలిసారి రాసిన కథకు...

- తోట పూజ, 10వ తరగతి



పద్య రచయిత ఆచి వెంకటాచార్యులది మా గ్రామం. మా గ్రామ రామాలయంలో దాదాపు నాలుగు వందల ఏళ్లకు పైగా నందదీపం వెలుగుతూనే ఉంది. పాడి పంటలకు నిలయం. కరవు అనేది ఉండదు. గ్రామ ఒడ్డున ఏడాది పొడవునా పారే మానేరు వాగు, పచ్చని పైర్లతో గ్రామ పొలిమేరలు దర్శనమిస్తాయి. సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు మా ఊరు. నేను రాసిన మా ఊరి అందాలు కథ రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. నవంబర్ 3న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రోత్సాహక బహుమతి అందుకోనున్నాను. తొలిసారి రాసిన కథ రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడం సంతోషంగా ఉంది.

గృహిణికి వేతనం చెల్లించవచ్చా

- బుర్ర దేవిక, నిఖిల్ సాయి, పదో తరగతి



కుటుంబాన్ని సంరక్షించే ఒక గృహిణి పనికి వేతనం చెల్లించవచ్చా అనే అంశంపై రాశాం. మహిళలు ఇంట్లో దుస్తులు ఉతకడం, బోళ్లు తోమడం, ఇల్లు శుభ్రంగా ఉంచడం, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవడం, పెద్దలను సంరక్షించడం ఇలా ఎన్నో పనులు చేస్తున్నప్పటికీ వాళ్లు సంపాదించడం లేదనే సాకుతో వారి పనిని సమాజం, కుటుంబం ఎలా చిన్నచూపు చూస్తుందో వివరించాం. వారి జీవితాన్ని త్యాగం చేసి కుటుంబాన్ని రక్షించే బాధ్యత నిర్వహించడం ఆర్థికంగా వెలకట్టలేని పని. దీనికి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రావడం ఆనందంగా ఉంది.

మౌలిక వసతుల కల్పనకు ఆదేశం

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్ కాలనీలోని సమస్యలపై 'ఈనాడు'లో ఈనెల 22న 'ఇల్లు ఇచ్చారు.. వసతులు మరిచారు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి, ఎంపీడీవో లక్ష్మీనారాయణలు గురువారం కేసీఆర్ నగర్‌ను సందర్శించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్తు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. కేసీఆర్‌నగర్‌లో మౌలిక వసతులు, ఇతర సమస్యల పరిష్కారానికి, గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయడానికి, తగిన సిబ్బందిని నియమించడానికి చర్యల నిమిత్తం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు నివేదిక సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

పెరుగుతున్న భూ వివాదాలు

◆ విక్రయించిన వ్యవసాయ భూములకు పాసుపుస్తకాలు
◆ ఇళ్ల స్థలాలకూ రెండు, మూడుసార్లు రిజిస్ట్రేషన్లు



■ కొండగట్టు ప్రాంతంలో ఘాట్ రోడ్డు పక్కన నిర్మించిన దుకాణ భవన సముదాయంలోని గదులను ఓ స్థిరాస్తి వ్యాపారి ఒక్కో గదిని రూ.5 లక్షల వరకు ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించినట్లు పలువురు బాధితులు మల్యాల ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కొండగట్టుకు చెందిన మరో వ్యక్తి తనకు చెందిన ఓ ప్లాటును ముగ్గురు వ్యక్తుల పేర విక్రయించడంతో పోలీసులు సదరు వ్యక్తిపై మోసం కేసు నమోదు చేశారు. ఈ విధంగా కొండగట్టు ప్రాంతంలో పలువురు వ్యక్తులు అక్రమంగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

న్యూస్‌టుడే, మల్యాల

జగిత్యాల జిల్లాలో భూవివాదాలు విపరీతంగా పెరుగుతున్నాయి. కొందరు స్థిరాస్తి వ్యాపారులు, దళారుల మాయాజాలంతో భూముల ధరలు ఆకాశాన్నంటడంతో చాలా ఏళ్ల కిందట విక్రయించిన భూములను తాము విక్రయించలేదని పేర్కొంటూ కొందరు వ్యక్తులు గొడవలకు దిగుతున్నారు. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న మల్యాల మండలంలోని ముత్యంపేట, కొండగట్టు, బల్వంతాపూర్, మల్యాల అడ్డరోడ్డు, నూకపల్లి, రాజారం తదితర గ్రామాల పరిధిలోని భూములకు డిమాండు ఏర్పడటంతో కొందరు వ్యక్తులు తాము విక్రయించిన భూమిని మళ్లీ మరో వ్యక్తికి విక్రయించడంతో వివాదాలకు దారితీస్తోంది. రాజకీయ నాయకులు కూడా భూముల ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్‌తో మోసాలకు పాల్పడుతున్నారు.

■ మల్యాల అడ్డరోడ్డు, నూకపల్లి, రాజారం శివారులోని వ్యవసాయ భూముల ఇళ్లప్లాట్లకు అనుకూలంగా ఉండటంతో పట్టణ ప్రాంతాలకు చెందిన వైద్యులు, బడా వ్యాపారులు ఎకరాకు రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ మళ్లీ భూ యజమానులు అది తమ తాతల నాటి భూమి అని దానిని తాము విక్రయించలేదని పేర్కొంటూ నకిలీ దస్త్రాలు సృష్టించి కొత్తగా రెవెన్యూ అధికారుల నుంచి పాసు పుస్తకాలు పొందుతుండటం పెద్ద సమస్యగా మారుతోంది.

■ భూములు కొనుగోలు తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులు సదరు భూమిని రెవెన్యూ కార్యాలయంలో 'మ్యుటేషన్' అమలు చేసుకోపోతే నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమిని దళారులు ఆక్రమించుకుని పాల్పడుతున్నారు. ఈ విధంగా మల్యాల మండలంలో పదుల సంఖ్యలో ఇటీవలే భూవివాదాలు వెలుగుచూస్తున్నాయి. గతంలో రెవెన్యూ కార్యాలయంలో పనిచేసిన కొందరు వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లతో ఇతర వ్యక్తులకు చెందిన భూములను వారికి తెలియకుండా తమ పేర లేదా కుటుంబ సభ్యుల పేర నమోదు చేసుకోవడంతో బాధితులు ఇప్పటికీ న్యాయం చేయాలని ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

మోసాలకు పాల్పడేవారిపై చర్యలు

భూములకు సంబంధించి సరైన పత్రాలు కలిగి ఉండి, మోఖాపై ఉండే వ్యక్తుల భూముల ఆక్రమణకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మోసాలకు పాల్పడే వ్యక్తులపై కేసు నమోదు చేయడం ద్వారా నిజమైన భూయజమానులకు రక్షణ కూడా కల్పిస్తాం. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారికి ఇరువైపుల భూములకు రేట్లు అధికంగా ఉండటంవల్ల ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డ పలువురిపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం.

- నీలం రవి, మల్యాల సీఐ

అక్రమ రిజిస్ట్రేషన్లు జరగకుండా చూస్తాం

మల్యాల మండలంలో కొందరు అక్రమంగా భూముల రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు, మరి కొందరు తమ భూమిని విక్రయించినా ఠాణాలో పాసుపుస్తకాలు పొందినట్లు మా దృష్టికి రావడంతో చర్యలు తీసుకుంటున్నాం. అక్రమ రిజిస్ట్రేషన్ల గురించి మా దృష్టికి తీసుకొస్తే ఫైళ్లు చెయ్యిస్తాం. గతంలో ధరణిలో ఒక రిమామి మరొకరి పేర రిజిస్ట్రేషన్ చేశారు. ఈసీ పరిశీలించి పరిష్కరిస్తున్నాం.

- మునీందర్, తహసీల్దారు, మల్యాల

రూ.500 బోనస్ ఇచ్చే సన్నరకాలు

ప్రభుత్వం ప్రకటించిన వంగడాలు

న్యూస్‌టుడే, గంగాధర




ఎన్నికల హామీలో భాగంగా క్వింటాలు సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని రాష్ట్ర సర్కారు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఏ రకం వంగడాలకు బోనస్ వస్తుందోనన్న సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతోంది. వాటిని నివృత్తి చేసేందుకు ప్రభుత్వం 33 రకాల వంగడాలను గుర్తించింది. మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఈ మేరకు ఫ్లెక్సీలు ప్రదర్శిస్తున్నారు. అయితే జై శ్రీరామ్ సూపర్ ఫైన్ రకం ప్రభుత్వం గుర్తించిన వంగడాల్లో లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వాస్తవానికి ఈ రకం ధాన్యానికైనా, బియ్యానికైనా మార్కెట్‌లో మంచి డిమాండు ఉంది. ప్రభుత్వం అందించే మద్దతు ధర, బోనస్‌కు అదనంగా రైస్‌మిల్లర్లు చెల్లించి కొనుగోలు చేస్తారు. లేదా ధాన్యం మర పట్టించి బియ్యం అమ్మినా అంతకు రెట్టింపు ధర రైతులకు గిట్టుబాటు కానుంది. గింజ పరిమాణం కొలిచి నాణ్యమైన ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని పౌరసరఫరాల శాఖ డీఎం రజనీకాంత్ తెలిపారు. ఒకవేళ జాబితాలో లేకున్నా జైశ్రీరామ్ రకాని తెచ్చి.. కొనుగోలు చేస్తామని చెప్పారు.

కొనుగోలు కేంద్రాల్లో సేకరించే ధాన్యం రకం

- సిద్ది (డబ్ల్యూజీఎల్ 44)
- కంపాసాగర్ వరి-1 (కేపీఎస్ 2874)
- సాంబ మసూరి (బీపీటీ-5204)
- జగిత్యాల వరి-3 (జేజీఎల్ 27356)
- జగిత్యాల వరి-2 (జేజీఎల్ 28545)
- వరంగల్ సాంబ (డబ్ల్యూజీఎల్ 14)
- వరంగల్ సన్నాలు (డబ్ల్యూజీఎల్ 32100)
- జగిత్యాల మసూరి (జేజీఎల్ 11470)
- పొలాస ప్రభ (జేజీఎల్ 384)
- కృష్ణ (ఆర్ఎన్ఆర్ 2458)
- మానేరు సోనా (జేజీఎల్ 3828)
- తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048)
- వరంగల్ వరి- 1119
- కూనారం వరి-02 (కేఎన్ఎం 1638)
- వరంగల్ వరి-02 (డబ్ల్యూజీఎల్ 962)
- రాజేంద్రనగర్ వరి-4 (ఆర్ఎన్ఆర్ 21278)
- కూనారం వరి-1 (కేఎన్ఎం 733)
- జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798)
- జగిత్యాల సాంబ (జేజీఎల్ 3844)
- కరీంనగర్ సాంబ (జేజీఎల్ 3855)
- అంజన (జేజీఎల్ 11118)
- నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449)
- ప్రద్యుమ్న (జేజీఎల్ 17004)
- సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465)
- శోభిని (ఆర్ఎన్ఆర్ 2354)
- సోమ్‌నాథ్ (డబ్ల్యూజీఎల్ 347)
- ఆర్ఎన్ఆర్ 31479 (ప్రీరిలీజ్)
- కేపీఎస్ 6251 (ప్రీరిలీజ్)
- జేజీఎల్ 33124 (ప్రీరిలీజ్)
- హెచ్ఎంటీ సోనా
- మారుటేరు సాంబ (ఎంటీయు 1224)
- మారుటేరు మసూరి (ఎంటీయు 1262)
- ఎంటీయు 1271

మళ్లీ నురగ... కలుషిత జలాలతో బెంగ



గోదావరిఖని కోల్‌బెల్ట్ వంతెన వద్ద నదిలో తేలిన నురగ

పవిత్ర గోదావరినదిలో నీటిపై నురగ మళ్లీ పేరుకుంటోంది. ఎల్లంపల్లి నీళ్లు ఎత్తివేయడంతో దిగువకు రెండు రోజుల క్రితం నీటిని విడుదల చేశారు. నీటి ప్రవాహం లేకుండా ఎండిపోయి ఉన్న గోదావరినదిలో ప్రస్తుతం జలకళ సంతరించుకున్నప్పటికీ గురువారం ఉదయం నీటిపై నురగ తేలడంతో పవిత్ర స్నానాలకు వెళ్లే వారు ఆందోళనకు గురయ్యారు. గోదావరినది పరిసర ప్రాంతాల నుంచి కలుషిత జలాలు నదిలో చేరడం వల్లే నీటిపై నురగ తేలుతుందని స్థానికులు అంటున్నారు. నగరంలో వినియోగించిన నీటితో పాటు పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాలు నేరుగా నదిలో చేరడం వల్లే ఈ దుస్థితి తలెత్తుతోందని అంటున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమకు చెందిన రసాయన వ్యర్థాలు సైతం నేరుగా గోదావరి నదిలోకి చేరడంతో నురగ వస్తోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గోదావరినది పవిత్రతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గోదావరిఖని

ఎమ్మెల్యే గంగులకు కేటీఆర్ పరామర్శ



ఎమ్మెల్యే కమలాకర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

రాంపూర్(కరీంనగర్), న్యూస్‌టుడే: కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ తల్లి లక్ష్మీనర్సమ్మ ఇటీవల మరణించడంతో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ ఆయన్ను గురువారం పరామర్శించారు. లక్ష్మీనర్సమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమలాకర్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతిపై వారికి సానుభూతి తెలియజేశారు. కమలాకర్‌తోపాటు పలువురు నాయకులతో కాసేపు కేటీఆర్ మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, పెద్దపల్లి జడ్పీ మాజీ ఛైర్మన్ పుట్ట మధు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ వసంత, మాజీ ఎమ్మెల్యేలు రసమయి, రవిశంకర్, బాల్క సుమన్, మేయర్ వై.సునీల్‌రావు, భారాస జిల్లా అధ్యక్షుడు జి.వి.రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు హరిశంకర్, జడ్పీ మాజీ ఛైర్మన్ తుల ఉమ, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు కమలాకర్‌ను పరామర్శించారు. అనంతరం కేటీఆర్, ఎమ్మెల్యేలు, నాయకులు కమలాకర్ ఇంట్లో భోజనం చేశారు. అనంతరం కేటీఆర్ రాజన్న సిరిసిల్ల జిల్లాకు వెళ్లారు.

స్వల్పంగా తగ్గిన పత్తి ధర

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పత్తి ధర స్వల్పంగా తగ్గింది. యార్డుకు 172 ట్రాలీల విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.6,500 గరిష్ఠంగా రూ.6,750 ధర పలికింది. 32 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా రూ.6,000 నుంచి రూ.6,400 దాకా ధర పలికింది. బుధవారం కంటే తాజాగా పత్తి ధర రూ.50 తగ్గింది. తేమ శాతంతో ధర తగ్గించిన మార్కెట్ అధికారులు పేర్కొన్నారు. బిడ్డింగ్‌ను మార్కెట్ ద్వితీయ శ్రేణి కార్యదర్శి రాజు పరిశీలించారు. స్థానిక మార్కెట్‌లో సీసీఐ 4 ట్రాలీల పత్తిని ఖరీదు చేసిందని ఆయన చెప్పారు.

పట్టభద్రులూ మేల్కోండి

ఓటరు నమోదుకు కదలండి ◆ మరో 13 రోజులే గడువు





న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్, వెల్గటూరు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి ఎన్నికల ప్రచార సందడి రోజురోజుకు పెరుగుతోంది. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రచారం ముమ్మరం చేశారు. పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలుస్తూ.. ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. కాని ఓటరు నమోదు ప్రక్రియ మాత్రం నత్తనడక సాగుతోంది. దరఖాస్తుల స్వీకరణకు నవంబరు 6వ తేదీ వరకు గడువు ఉండటంతో 13 రోజులే మిగిలి ఉంది. ఇక నైనా అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు నమోదుకు కదలాల్సిన అవసరముంది.

నమోదు కేంద్రాలు వెలవెల..


జిల్లాల్లోని అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారిని నియమించి దరఖాస్తులను అందుబాటులో ఉంచారు. అయినా ఆదరణ అంతంత మాత్రంగానే ఉంటోంది. దీపావళి పండగ అనంతరం నమోదు ప్రక్రియ వేగం పుంజుకుంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కరీంనగర్ గ్రామీణ మండల రెవెన్యూ కార్యాలయంలో ఓటరు నమోదు బ్యానర్

ఉపాధ్యాయుల్లోనూ స్పందన అంతంతే..

సాధారణంగా ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో కొనసాగేవారు నమోదులో ముందుంటారని ఎవరైనా భావిస్తుంటారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు విషయంలో మాత్రం ఆ వర్గాలు ఆసక్తి చూపడంలేదని తాజా గణాంకాలను చూస్తే తెలుస్తోంది. ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాఠశాలలకు వెళ్లి స్వచ్ఛందంగా నమోదు పత్రాలు అందజేసినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. మండలి ఎన్నికల్లో ఓటు వేయాలంటే కొత్తగా అర్హులందరూ దరఖాస్తు సమర్పించాలి. ఇప్పటివరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉపాధ్యాయులు 1761, పట్టభద్రులు 66,743 ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. తగ్గకుండా ఉన్నత పాఠశాల, కళాశాల స్థాయి విద్యాసంస్థల్లో పని చేసే ఉండాలి. వారు ఫారం-19తో ఓటరు నమోదు చేసుకునే వీలుంటుంది. దరఖాస్తు.. ఉన్న చోట నుంచే ఓటరు నమోదు చేసుకునే అవకాశం సైతం ఎన్నికల కమిషన్ కల్పించింది. అందుకు www.ceotelangana.nic.in వెబ్‌సైట్‌ను ప్రవేశపెట్టింది.



ఓటరుగా ఎవరు నమోదు చేసుకోవచ్చు..

పట్టభద్రులు ఓటు నమోదు (ఫారం-18 చేసుకోవాలంటే) 2021 అక్టోబరు 31 వరకు డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. ఉపాధ్యాయులు, అధ్యాపకులైతే 2018 నవంబరు వరకు మూడేళ్లకు పట్టభద్రులు ఫారం-18, ఉపాధ్యాయులైతే ఫారం-19 దరఖాస్తు పూరించి గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్, ఓటరు ఐడీ పత్రాలతోపాటు పోటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే మీరు ఓటరుగా నమోదైనట్లే.

దళారుల చేతిలో పత్తి రైతులు దగా



ఇతర ప్రాంతాలకు తరలించేందుకు వ్యాన్‌లో నింపిన పత్తి

న్యూస్‌టుడే, వేములవాడ

పత్తి రైతులు గ్రామాల్లో దళారుల చేతిలో మోసాలకు గురవుతున్నారు. ఇప్పటికే మొదటి దఫా పత్తి సేకరణ చేసిన రైతులు నుంచి దళారులు కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో కాంటాలు పెట్టి మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు.

జిల్లాలో ఈ ఏడాది 42,390 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేయగా 30,028 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే జిల్లాలో పత్తి సేకరణ ఆరంభం కుంది. ఇప్పటికే జిల్లాలోని చాలా గ్రామాల్లో రైతుల వద్ద దళారులు తక్కువ ధరకు భారీ ఎత్తున పత్తి కొనుగోలు చేస్తూ ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లులకు తరలిస్తున్నారు.

సీసీఐ కేంద్రాల ఏర్పాటుతోనే ప్రయోజనం

భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాలను ఇంకా జిల్లాలో ప్రారంభించకపోవడంతో దళారులకు కలిసొస్తుంది. ఇదే అదనుగా పత్తి రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులకు ప్రయోజనం కలగనుంది. జిల్లాలో సుద్దాల, నాంపల్లి, సంకెపల్లి, గొల్లపల్లి, తాళ్లపల్లి ఐదు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ప్రతిపాదించినప్పటికీ ఇంకా ప్రారంభం కాలేదు. పత్తి రైతులు దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. 8 నుంచి 12 శాతం తేమతో ఉన్న పత్తికి సీసీఐ క్వింటాలుకు రూ.7,521 నుంచి రూ.7,421 వరకు పింజ పొడవును బట్టి ధరను చెల్లిస్తుంది. గ్రామాల్లో దళారులు తేమ శాతం ఎక్కువ ఉందని చెప్పి రూ.6 వేల నుంచి రూ.6,200లకే కొంటున్నారు. పత్తి విక్రయానికి రైతులకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో దళారులు చెప్పిందే ధర అన్న చందంగా మారింది. దీంతో గిట్టుబాటు ధర లభించడం లేదు. కొన్ని జిన్నింగ్ మిల్లుల్లో క్వింటాల్ పత్తికి నాణ్యతను బట్టి రూ.6,500ల వరకు చెల్లిస్తున్నారు.

రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తాం

జిల్లాలో అయిదు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను రెండు, మూడు రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కలెక్టర్ ద్వారా అగ్రిమెంట్ జరిగింది. పత్తి రైతులు తొందరపడి దళారులకు విక్రయించి మోసపోవద్దు. నాణ్యమైన పత్తిని సీసీఐకి విక్రయించి కనీస మద్దతు ధర పొందాలి.

- ప్రకాశ్, జిల్లా మార్కెట్ శాఖ ఇన్‌ఛార్జి అధికారి

తూకాల్లోనూ మోసాలు

గ్రామాల్లో దళారులు తూకాల్లోనూ మోసం చేస్తున్నారు. కొందరు వ్యాపారులు, దళారులు క్వింటాలుకు దాదాపు రెండు నుంచి మూడు కిలోలను దోచుకుంటున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఏటా పత్తి సాగుకు పెట్టుబడులు పెరిగి పోతున్నప్పటికీ ఆశించిన మేర దిగుబడులు రాక నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో ఎక్కువ ధర ఆశ చూపి దళారులు తూకాల్లో మోసం చేస్తున్నారని ఆరోపణలున్నాయి. బండ రాళ్లు, పత్తి బోరాలు ఎత్తుగా చేసి తూకాలు వేస్తున్నారు. దీంతో మోసం జరుగుతోంది. గ్రామాల్లో పత్తి కొనుగోలు చేసే దళారులపై తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి దాఖలాలు లేవు. దీంతో దళారులు ఇష్టారాజ్యంగా రైతుల వద్ద కొనుగోలు చేస్తూ గుట్టు చప్పుడు కాకుండా రైతులను దోపిడీకి గురి చేస్తున్నారని ఆరోపణలున్నాయి.

ఆరోగ్యానికి మిద్దె సాగు

■ పచ్చని మొక్కలతో ఆహ్లాదంగా ఇంటి పరిసరాలు




మిద్దెపై పండ్లు, పూలు, కూరగాయల మొక్కలు


న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

తినే ఆహారం, తాగేనీరు, పీల్చే గాలి ఇలా అన్నీ కలుషితం అవుతుండడం.. వాటిని తిన్న వారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో చాలా మంది సొంతంగా మిద్దెపై కూరగాయలు, ఆకుకూరలు పెంచుతూ డబ్బుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

మెట్‌పల్లి పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన టీటీడీ ఉద్యోగి రంజిత్-లాస్య ఇల్లు మొక్కలతో పచ్చదనంగా మారింది. లాస్యకు చిన్ననాటి నుంచి మొక్కలంటే ఎంతో మక్కువ. ఉదయం, సాయంత్రం సమయాన్ని కేటాయిస్తూ వివిధ రకాల మొక్కలను పెంచుతుంది. మిద్దెపై పండ్లు, పూలతో పాటు వివిధ రకాల కూరగాయలను సాగుచేస్తూ ఇంటికి వినియోగించుకుంటూనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటున్నారు. మిద్దెపై ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేసుకుని జామ, అంజీరా, మామిడి, దోస, సపోట, పంపర పనస, మునగ, బొప్పాయి మొక్కలతో పాటు టమాట, చిక్కుడు, బీర, సొర, కాకర, పొట్లకాయ, మిరపకాయ, బెండ, వంకాయలాంటి కూరగాయలతోపాటు వివిధ రకాల గులాబీ, గన్నేరు, మల్లె, చామంతి, బంతి పూల మొక్కలను పెంచుతున్నారు. ఇంట్లో వాడి పడేసిన నూనె డబ్బాలు, వాటర్ బాటిళ్లతో పాటు వివిధ ప్లాస్టిక్ డబ్బాలను సేకరించి వాటికి రంగులు వేసి మొక్కలను పెంచుతూ వాటిని ఇంటి ముందు వేలాడదీశారు. నిత్యం ఇంట్లో వెలువడే కూరగాయలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలతో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. ఎరువును మొక్కలకు అందిస్తుండటంతో రసాయన ఎరువుల వినియోగం లేకుండా మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో ఇంట్లో లభించే వాటితో డబ్బులు ఆదా చేసుకుంటున్నారు.



లాస్య-రంజిత్ దంపతులు



కబడ్డీలో తలపడుతున్న సిరిసిల్ల-వీణవంక జట్లు

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ మహాత్మా జ్యోతిబా ఫులే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో జరుగుతున్న బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్‌లో కబడ్డీలో సిరిసిల్ల, వీణవంక జట్లు తలపడగా సిరిసిల్ల జట్టు గెలుపొందింది. ఖోఖోలో కొత్తపల్లి, సైదాపూర్ తలపడగా కొత్తపల్లి జట్టు, వాలీబాల్‌లో స్తంభంపల్లి, గంగాధర తలపడగా స్తంభంపల్లి జట్టు గెలుపొందాయి. లాంగ్ జంప్‌లో సైదాపూర్, వీణవంక పాఠశాలల విద్యార్థులు సాయికిరణ్, కౌశిక్‌లు విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. విజేతలను పాఠశాల ప్రధానాచార్యులు జక్కుల రాజేశం, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

బోయినపల్లి, న్యూస్‌టుడే

? విలాసాగర్ నుంచి కొదురుపాక దారిలో లోలెవల్ కల్వర్టు వల్ల వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హైలెవల్ వంతెనలు నిర్మించాలి. - రాజు, విలాసాగర్

✓ హైలెవల్ వంతెనల నిర్మాణం కోసం పరిశీలన చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. - విష్ణువర్ధన్, పీఆర్ ఏఈ

అక్రమాలకు 'వే'పై అధికారుల విచారణ

బోయినపల్లి, న్యూస్‌టుడే: మాన్వాడ మానేరు వాగులో ఇసుక రవాణా కోసం తహసీల్దారు కార్యాలయం నుంచి జారీ చేసిన వే బిల్లులపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గురువారం విచారణ చేపట్టారు. 'అక్రమాలకు 'వే'' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై నివేదిక అందించాలని బోయినపల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆదేశించారు. మైనింగ్ ఏడీ క్రాంతికుమార్ మాన్వాడ వద్ద మధ్యమానేరు జలాశయం ముందు భాగం మానేరు వాగులో ఇసుక తరలించిన ప్రాంతాలను చూశారు. జిల్లా అధికారులకు నివేదిక అందించనున్నట్లు ఏడీ చెప్పారు.

ఈనాడు స్పందనకు వందనం

మొక్కల తొలగింపు

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల పట్టణంలోని అశోక్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాల సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్తు స్తంభం చివరి వరకు తీగజాతి మొక్కలు పాకాయి. వర్షాలు పడే సమయంలో తీగకు తగిలి విద్యుత్తు సరఫరా అయ్యే అవకాశం ఉంది. దీనిపై ఈ నెల 22న 'ఈనాడు'లో 'అల్లుకున్న నిర్లక్ష్యం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి సెస్ అధికారులు స్పందించారు. మొక్కలను తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రెల్లరాల్చు పురుగు మూకుమ్మడి దాడి

వరి కోతల్లో గుర్తించిన అన్నదాతలు ● పంట దిగుబడిపై ప్రభావం

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

చూస్తే ఏపుగా, ఆరోగ్యంగా పంట ఉంది. ఈసారి మంచి లాభాలు వస్తాయనే ధీమా. తీరా వరికోత యంత్రాలతో కోయిస్తుండగా పొలమంతా కంకులు నేలరాలి ఉండటంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. వరి కోత యంత్రంలో సాంకేతిక లోపం వల్ల వరికంకులు నేలవాలాయనే అనుమానంతో మొదట్లో పొలంలో దిగిన యంత్రానికి బదులుగా మరో యంత్రాన్ని వినియోగించారు. అయినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో మిడతలు, గడ్డిచిలుకలతో ఇలా జరిగిందని తొలుత భావించారు. రెల్లరాల్చు (క్లైంబింగ్ కట్ వార్మ్) పురుగులు దండు పాల్యంలా వరి పొలాలపై దాడి చేయడంతో ఈ నష్టం జరిగిందని వ్యవసాయాధికారులు తేల్చారు.

రెల్లరాల్చు పురుగులు వరి కంకులను కట్ చేసి, నేలమట్టం చేసి, అన్నదాతలకు అపార నష్టాన్ని మిగిల్చాయి. ఈ పురుగులు పొలాల్లో వ్యాపించినట్లు రైతులు ఆలస్యంగా గుర్తించారు.

✦ ప్రధానంగా సన్నరకం వరిలో దీని తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. చేతికందివచ్చిన పైరులో వరిగొలలు నేలపాలు కాగా దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో కర్షకులు కంటతడి పెడుతున్నారు.

✦ జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలంలో ఈ పురుగు ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది.

వానాకాలం సీజన్‌లో వరి సాగు	: 1,79,672 ఎకరాలు
సన్నరకం	: 13,552 „
దొడ్డురకం	: 1,66,123 „



వరిపైరుపై రెల్లరాల్చు పురుగులు

వేల సంఖ్యలో చేరి.. వరి కంకులను నేలపాలు చేసి

రెల్లరాల్చు పురుగులు వరి పైరు జీవిత కాలంలో గింజలు పాలుపోసుకునే దశ నుంచి కోత దశ వరకు ఎప్పుడైనా అవి దాడిచేయవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పగటి వేళల్లో కంటికి కనిపించకుండా వరికొయ్యల దుబ్బు కిందభాగంలో సేదతీరుతాయి. చీకటిపడగానే వేల సంఖ్యలో వరి కంకి ప్రారంభ ప్రదేశానికి చేరుకుంటాయి. ఆ భాగాన్ని కట్ చేయడంతో గింజలకు పోషకపదార్థాలు అందకతాలుపోతాయి. మరోవైపు గింజలు గట్టిపడినప్పటికీ పురుగులు ఆశించడంతో కంకి విరిగిపోయి, కింద పడిపోతుంది. ఒక్కరోజు రాత్రి సమయంలోనే వందల ఎకరాల విస్తీర్ణంలోని వరి పంటను దెబ్బతీస్తాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ పురుగు ప్రభావం ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

అంచనా తలకిందులైంది

- చల్ల కిష్టారెడ్డి, రైతు, రాచర్ల బొప్పాపూర్

నేను 8 ఎకరాల్లో సన్నరకం వరిని సాగుచేశాను. తెగుళ్లు ఆశించకుండా పంట యాజమాన్య పద్ధతులను పాటించాను. రెండు పర్యాయాలు పురుగుల మందును కూడా పిచికారీ చేశాను. పంటను చూస్తే దిగుబడి బాగా వస్తుందని ఆశించాను. తీరా వరి కోస్తున్న సమయంలో కంకులన్నీ కింద పడి కనిపించాయి. 8 ఎకరాలకు 160 క్వింటాళ్లకు పైగా ధాన్యం వస్తాయని వేసిన అంచనా తలకిందులైంది. కనీసం 120 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు.



పొలంలో నేలరాలిన వరి కంకులు

రెండెకరాలకు మూడు ట్రాలీల వడ్లు

- అంజిరెడ్డి, రాచర్ల బొప్పాపూర్

నేను ఏడు ఎకరాల్లో సన్నరకం వరిపంట వేశాను. ఎప్పటికప్పుడు అప్రమత్తమవుతూ సస్యరక్షణ చర్యలు చేపడుతూ పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాను. ఇటీవల రెండెకరాల్లో వరిని కోయించగా పెద్ద ఎత్తున వరికంకులు పొలంలో పడి ఉన్నాయి. సాధారణంగా 20 గుంటల విస్తీర్ణానికి నాలుగు ట్రాలీల వడ్లు రావాలి. కానీ రెండెకరాలకు 3 ట్రాలీలు వచ్చాయి. ఈ లెక్కన సుమారు 16 నుంచి 17 క్వింటాళ్లు తక్కువ వచ్చాయి.

కొత్త దశలో నివారణ చర్యలు లేవు

- కవిత, మండల వ్యవసాయాధికారిణి, ఎల్లారెడ్డిపేట



రెల్లరాల్చు పురుగును ముందుగా గుర్తిస్తే సస్యరక్షణ చర్యలు తీసుకోవచ్చు. పరిపక్వ దశలో ఎలాంటి మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండదు. పైరు ఈనే దశలో గుర్తిస్తే వెంటనే మందులను పిచికారీ చేయాలి. ప్రస్తుతం రెల్లరాల్చు పురుగు ప్రభావానికి గురైన పొలాల్లో మళ్లీ రాకుండా ఉండేందుకు వరి కొయ్యలను తొలగించాలి. పచ్చిరొట్ట ఎరువులు వేయకుండా పేడ వంటి ఎరువుల(ఎఫ్‌వైఎం)ను వాడాలి.

రూ. 70 వేల విలువైన వస్తువుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు కోట సతీశ్‌కుమార్ రూ. 70 వేల విలువైన వస్తువులను గురువారం పేదలకు పంపిణీ చేశారు. ముగ్గురు మహిళలకు కుట్టుమిషన్లు, నలుగురు విద్యార్థినులకు సైకిళ్లు, ఒక దివ్యాంగురాలికి మూడు చక్రాల సైకిల్, ఇద్దరు కౌలు రైతులకు రెండు స్ప్రేయర్‌లను అందజేశారు. అలాగే మండలం నుంచి ఉపాధ్యాయులుగా ఎంపికైన 10 మందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి నాయిని భాస్కర్‌రెడ్డి, ప్రతినిధులు రావుల లింగారెడ్డి, పయ్యావుల రామచంద్రం, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, సద్ది లక్ష్మారెడ్డి, కొలనూరి శంకర్, బోయిని మహాదేవ్, రావుల మల్లారెడ్డి, దేవయ్య, మల్లేశ్, రవి, డాక్టర్ అమరేందర్‌రెడ్డి, వనం ఎల్లయ్య, ముత్యంరెడ్డి, రవి, సాంబశివరావు, నాగార్జునరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కొనసాగుతున్న మాజీ సర్పంచుల దీక్షలు



సిరిసిల్ల దీక్షలో జేఏసీ నాయకులు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం ఆరో రోజుకు చేరాయి. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, నాయకులు అంజయ్య, గణప శివజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఛైర్‌పర్సన్‌కు సన్మానం

ముస్తాబాద్, న్యూస్‌టుడే: ముస్తాబాద్ మండల పోత్గల్ గ్రామానికి చెందిన తలారి రాణి పోత్గల్ ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా నియామకం కావడంతో మాల మహానాడు మండల అధ్యక్షుడు జంగ భూమరాజ్ ఆధ్వర్యంలో నాయకులు ఏఎంఆర్ గార్డెన్‌లో రాణి దంపతులతో పాటు డైరెక్టర్ క్యారం రాజులను శాలువాతో గురువారం ఘనంగా సన్మానించారు. అన్నదాతలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు తుంగ శివరాజ్, రేసు కిషన్, లక్ష్మణ్, ఈసరి కృష్ణ, యారటి కరుణాకర్, జక్కుల యాదగిరి, రామచంద్రం, సిరిగిరి మురళి, బిల్లం మురళి తదితరులు పాల్గొన్నారు.



రాణిని సన్మానిస్తున్న మాలమహానాడు నాయకులు

మరో ఇద్దరికి...

ఎల్లారెడ్డిపేట: ఎంబీబీఎస్‌లో సీటు పొందిన విద్యార్థినిని, ఎస్సై శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరిన యువకుడిని వారి తండ్రుల స్నేహితులు గురువారం ఇళ్లకు వెళ్లి ఘనంగా సన్మానించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బావికాడి అరుణ, రామచంద్రం దంపతుల కుమార్తె హర్షిత ఎంబీబీఎస్‌లో సీటు పొంది కళాశాలలో చేరింది. అలాగే మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన పిట్ల లక్ష్మి- శ్రీశైలం దంపతుల తనయుడు దీపక్ ఎస్సై శిక్షణను పూర్తిచేసుకొని కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇటీవలే విధుల్లో చేరాడు. వారి తండ్రుల స్నేహితులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు భూమరాజం, గంట రమేశ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏలూరి రాజయ్య, ఏఎంసీ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, బాలరాజు, రాజు, అంజయ్య, బాబు, అమృతలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీకి సత్కారం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన న్యాయవాది పసుల కృష్ణ సిరిసిల్ల సబ్ కోర్టులో అదనపు ప్రభుత్వ ప్లీడర్‌గా ఎంపికైన నేపథ్యంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం ఆయనను శాలువాతో సత్కరించారు. పేదలకు న్యాయం చేయడంతోపాటు భవిష్యత్తులో ఉన్నతమైన స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ లోకుర్తి బాలమల్లు, మండలశాఖ అధ్యక్షుడు కంచర్ల నర్సింలు, కోరుట్లపేట మాజీ సర్పంచి మేడిపల్లి దేవానందం, నాయకులు బత్తుల బాబు, సుడిది రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ కుమార్తెకు ఎంబీబీఎస్ సీటు

నారాయణపూర్(ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన ఓ ఆర్‌ఎంపీ కుమార్తె పాముల పావని ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఒకే ఇంట్లో అన్నాచెల్లెళ్లు ఇద్దరూ ఎంబీబీఎస్ విద్యార్థులే కావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన పాముల శ్రీనివాస్ ఆర్‌ఎంపీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని భార్య లత గృహిణి. ఇద్దరు పిల్లలు పవన్‌సాయి, పావని ఉన్నారు. వీరిలో పవన్‌సాయి హైదరాబాద్‌లోని సీఎంఆర్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే పావని సైతం నీట్‌లో ప్రతిభ కనబర్చి, హైదరాబాద్‌లోని టీఆర్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాలలో గురువారం ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందింది. పీజీ పూర్తి చేసి, పేదలకు వైద్య సేవలందిస్తానని పావని పేర్కొంది. ఈ సందర్భంగా ఆమెను గ్రామస్థులు అభినందించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎల్లారెడ్డిపేట ఎంఈవో జి. కృష్ణహరి ఆకాంక్షించారు. మండలంలోని రాచర్ల బొప్పాపూర్ జ్ఞానదీప్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర, జోనల్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. సుల్తానాబాద్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలను నిర్వహించగా అండర్-17 బాలుర విభాగంలో విద్యార్థి ఐ. గణేశ్, కరీంనగర్ జోనల్ స్థాయి అండర్-17 బాలుర విభాగం కబడ్డీ, ఖోఖో పోటీల్లో ఇ. నవనీత్, జి. భానుప్రసాద్, అండర్-14 ఖోఖో బాలుర వాలీబాల్ పోటీల్లో సీహెచ్. నవనీత్, బాలికల కబడ్డీలో బి. తన్విక సత్తాచాటారు. అలాగే అండర్-14 బాలుర వాలీబాల్‌తోపాటు లాంగ్‌జంప్‌లో సీహెచ్. రవిప్రకాశ్ రెండోస్థానాన్ని దక్కించుకున్నారు. ఈ నెల 28న తలపెట్టిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటి, జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఎంఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు లక్ష్మీనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణ్, మధు పాల్గొన్నారు.

బీసీ కులగణన చారిత్రాత్మకం

గంభీరావుపేట, న్యూస్‌టుడే: బీసీ కులగణన చేయటం చారిత్రాత్మక నిర్ణయం అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మండ్లు తెలిపారు. గంభీరావుపేట మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన అల్లె రాజం ఏఎంసీ డైరెక్టర్‌గా నియామకం కావడంతో గురువారం సన్మానించారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై చర్చకు ఎమ్మెల్యే సిద్ధమా?

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: రైతు రుణమాఫీపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చర్చకు సిద్ధమా అని మాజీ శాసన సభ్యుడు రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. గురువారం ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వంపై నమ్మకం లేక దళారులకు ధాన్యం విక్రయిస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారు తప్ప ఎక్కడా సేకరించడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ వేణు, భారాస మండలశాఖ అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ గొడుగు తిరుపతి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఇల్లంతకుంటలో మాట్లాడుతున్న రసమయి

మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించాలి

కోనరావుపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం మహిళల అభివృద్ధికి వడ్డీ లేని రుణాలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల డిమాండ్ చేశారు. కోనరావుపేట మండల కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. మహిళల రక్షణకు చట్టాలను కఠినతరం చేయాలన్నారు. గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు ఆర్థికసాయం

వెంకటాపూర్(ఎల్లారెడ్డిపేట): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో మహ్మద్ బీబీ కుటుంబానికి సెస్ ఏఈ పృథ్వీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం ఆర్థికసాయం అందించారు. భర్త వదిలిపెట్టి వెళ్లడంతో కూలీ పనిచేసుకుంటూ మహ్మద్ బీబీ ముగ్గురు పిల్లలను సాకుతున్నట్లు తెలిపారు. వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకుని సెస్ సిబ్బంది రూ. 2 వేల నగదు, 25 కిలోల బియ్యం, నెల రోజులకు సరిపడా నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, సెస ఏఈ పృథ్వీధర్, సిబ్బంది ప్రవీణ్, లక్ష్మీరాజం, దేవేందర్, బాబు, రమేశ్, శ్రీనివాస్, సతీశ్ పాల్గొన్నారు.



వీర్నపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఎల్లయ్య



కోనరావుపేటలో...



వేములవాడ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో...

సమాజ రక్షణలో పోలీసుల పాత్ర కీలకం

వీర్నపల్లి, న్యూస్‌టుడే: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని ఎస్సై ఎల్లయ్య పేర్కొన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ఠాణలో స్టేషన్ హౌస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఫిర్యాదుతో మొదలుకుని కోర్టులో నిందితులను హాజరు పరిచే విధానాన్ని క్షుణ్ణంగా వివరించారు. రికార్డులు, ఆయుధాల నిర్వహణపై అవగాహన కల్పించారు. 100 నంబర్‌ను సంప్రదిస్తే కంట్రోల్ రూం ద్వారా పోలీసుల ప్రతి స్పందనను క్షేత్ర స్థాయిలో వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లచ్చయ్య, బాబు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట ఠాణాలో పోలీసులు ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఎస్ఐ కిరణ్‌కుమార్ విద్యార్థులకు పోలీసుల విధులు, ఆయుధాల వినియోగం తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ గ్రామీణం: వేములవాడ గ్రామీణ పోలీస్ స్టేషన్లో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పోలీసులు వినియోగిస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, రిసెప్షన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై మారుతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఇల్లంతకుంటలో...

వేములవాడ: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. సీఐ వీర ప్రసాద్ పోలీస్‌శాఖలో అమలవుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డయల్ 100 తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో కళాశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై అవగాహన కల్పించారు. ఆయుధాల పనితీరు, పోలీసుల విధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ గౌడ్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వేములవాడలో పట్టణ సీఐ వీరప్రసాద్...

పేదల సంక్షేమమే ధ్యేయం

ముస్తాబాద్, న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు మంజూరు కాగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాయకులతో కలిసి లబ్ధిదారులకు గురువారం చెక్కులను అందించారు. వివిధ గ్రామాలకు చెందిన 28 మంది లబ్ధిదారులకు రూ. 15 లక్షలు మంజూరు కాగా లబ్ధిదారులకు చెక్కులు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్ బద్దిపడిగె ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచి రమణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చర్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే: కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన 68వ నేషనల్ గేమ్స్‌లో వాలీబాల్ పోటీల్లో సిరిసిల్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అండర్-19 విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. దీంతో వీరిని రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ విజయ రఘునందన్, అధ్యాపకులు అభినందించారు.

వానరానికి వైద్యం చేయించిన ఈవో

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఓ వానరం పిల్ల ప్రమాదానికి గురై నడవలేని పరిస్థితిలో ఉన్న విషయాన్ని గమనించిన ఆలయ ఈవో వినోద్ రెడ్డి వైద్యం చేయించి మానవత్వాన్ని చాటుకున్నారు. వెంటనే ఆలయ గోశాలలో విధులు నిర్వహిస్తున్న పశువైద్య సిబ్బందిని పిలిపించి వానరానికి వైద్యం చేయించగా కొంత సమయానికి అది తిరిగి వెళ్లిపోయింది.

భారాసవి గోడపత్రికల ఆవిష్కరణ

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పాలనలో విద్యారంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, గురుకులాల అద్దెలు చెల్లించలేక వాటికి తాళాలు పడిన పరిస్థితి నెలకొందని భారాసవి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ పేర్కొన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని ఓ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి భారాసవి రూపొందించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెట్టెల సాయి దీపక్, వెంకటరమణ, వలబోజ రమణ, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న నాయకులు, విద్యార్థులు

కరపత్రాలు..

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల పట్టణంలోని అంబేడ్కర్ కూడలి ఎదుట ధర్మ సమాజ్ పార్టీ కరపత్రాలను జిల్లా ఇన్‌ఛార్జి శ్రీకాంత్ మహరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీశ్‌గౌడ్ గురువారం ఆవిష్కరించారు. రాష్ట్రంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్య, వైద్యం, నివాస స్థలాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. నవంబర్ 3న హైదరాబాద్‌లో జరిగే పార్టీ కార్యకర్తల మహాసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కేసుగాని పరమేశ్వరి, బాబు, అరుణ్, అమర్, గోవర్ధన్, సురేశ్, మధు, ప్రవీణ్, మహేశ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని స్కూల్ కాంప్లెక్స్ ఆవరణలో మండల విద్యాధికారి రాజు స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులతో కలిసి గురువారం డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ రూపొందించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

గంభీరావుపేట, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడిన సంఘటన గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పోశవేణి లక్ష్మి భర్తకు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం రావటంతో మూడు నెలల క్రితం ఇంట్లో సామగ్రిని తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లింది. ఇంట్లోని ఒక గదిలో లక్ష్మి సామగ్రి పెట్టుకుని, రెండు నెలల క్రితం గ్రామానికి చెందిన కందుకుల అంజవ్వకు మిగతా గదులను అద్దెకు ఇచ్చింది. దసరా పండగకు వచ్చి, తిరిగి వెళ్లే సమయంలో అర తులం బంగారం గొలుసుతోపాటు 15 తులాల కాళ్ల పట్టీలు బీరువాలో పెట్టి వెళ్లింది. ఈ నెల 23న రాత్రి అంజవ్వ ఇంటికి తాళం వేసి పక్క ఇంట్లో పడుకుంది. అదే రోజు అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఉదయం లేచిచూసేసరికి గది తలుపు తెరిచి ఉండటంతో లక్ష్మికి సమాచారం అందించింది. ఆమె వచ్చి చూసే సరికి బంగారం, పట్టగొలుసులు కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదేవిధంగా గ్రామానికి చెందిన పాతూరి మల్లారెడ్డి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లగా దొంగలు లోపలికి చొరబడి బీరువా తెరిచి దుస్తులను చిందర వందరగా పడేశారు. మేకల లక్ష్మి ఇంట్లో రూ. 20 వేల నగదు ఎత్తుకెళ్లారు. పోశవేణి మల్లేశం ఇంట్లో కూడా చోరీకి ప్రయత్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

గంభీరావుపేట, న్యూస్‌టుడే: వివాహిత అదృశ్యమైన సంఘటన గంభీరావుపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని దేశాయిపేట గ్రామానికి చెందిన జక్కుల సుమలత ఈ నెల 22న భర్త రాజుతో కలిసి గంభీరావుపేట మండల కేంద్రంలోని ఎస్‌బీఐకి వెళ్లింది. ఎస్‌బీఐ ఖాతా పుస్తకం బదులు వేరే బ్యాంకు ఖాతా పుస్తకం తీసుకెళ్లడంతో దేశాయిపేటకు వెళ్లి తీసుకొస్తానని ఆమెను బ్యాంకు వద్ద ఉంచి రాజు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి భార్య సుమలత కనిపించలేదు. చుట్టు పక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికాడు. ఆచూకీ లభించకపోవటంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు



బాధితుడి చేతికి గాయాలు

శివంగళపల్లి (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం శివంగళపల్లిలో పిచ్చికుక్క దాడిలో నలుగురు గాయపడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన యువ రైతు బెజగం ధర్మయ్య వరి పంటను కోతుల బెడద నుంచి కాపాడుకోవటానికి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు. పిచ్చి కుక్క ఒక్కసారిగా దాడి చేయటంతో కాళ్లు, చేతులపై గాయాలయ్యాయి. తాటికొండ శ్రీవాణి మంచినీటికి వెళ్తుండగా, సావనపల్లి శ్రీకాంత్ ఇంటి ముందు ఉండగా, మరో వ్యక్తిపై దాడి చేసి గాయపర్చింది. బాధితులు కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు. రెండు రోజులు వరుసగా కుక్కల దాడితో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

కోనరావుపేట: గ్రామాల్లో కుక్కల బెడదపై ప్రజలను అప్రమత్తం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో శ్రీనివాసమూర్తి కోరారు. కోనరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఎంపీడీవో, మండల వైద్యాధికారి వేణుమాదవ్ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు ఒంటరిగా వెళ్లవద్దని, చేతికర్రలు వినియోగించాలని సూచించారు. కుక్కల దాడిలో గాయపడిన వారికి అవసరమైన టీకాలు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారి పేర్కొన్నారు. కుక్కకాటుకు గురైన బాధితులు వెంటనే టీకాలు వేయించుకోవటానికి పీహెచ్‌సీకి వచ్చేలా పంచాయతీ సిబ్బంది చూడాలన్నారు.

కేంద్ర సహాయ మంత్రి బండిని దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై హరీశ్‌రెడ్డి సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో దూషించాడని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎస్పీ అఖిల్ మహాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.